నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, సోమవారం 15 ఏప్రిల్ 2024 | KHAMMAM

- ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో నామా విస్తృత పర్యటన
- పార్టీ నేతలతో కలిసి సభలు, సమావేశాలు
- పాల్గొంటున్న ముఖ్యనేతలు
- ఇంకా ఖరారుకాని కాంగ్రెస్ అభ్యర్థి
- ప్రచారంలో దూకుడు పెంచుతున్న నామా
- ఈ నెల 24న నామినేషన్ దాఖలుకు ఏర్పాట్లు

కారు.. ప్రచార హోరు

ఖమ్మం, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : లోక్‌సభ ఎన్నికలకు బీఆర్ఎస్ పార్టీ సర్వం సమాయత్తమైంది. ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో అన్ని రాజకీయ పక్షాలకన్నా ముందుగా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ప్రస్తుత ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పార్టీ తన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసిందే తడవుగా నియోజకవర్గంలో ముఖ్యనేతలతో కలిసి సుడిగాలి పర్యటనలు ఇప్పటికే నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ నేతగా, ఖమ్మం ఎంపీగా కేంద్ర ప్రభుత్వం ద్వారా తాను సాధించిన అనేక పనులతోపాటు విభజన హామీలకు సంబంధించి లోక్‌సభలో పోరాటం చేసిన తీరును ఆయన పలుసభల్లో చెప్పిన తీరు ప్రజలను, కార్యకర్తలను ఆకట్టుకుంటోంది. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి సానుకూల వాతావరణం ఉండడంతో ప్రతి నియోజకవర్గంలో ఇప్పటికే విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా నేతలు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, వైరా మాజీ శాసనసభ్యులు బానోత్ మదన్‌లాల్, చంద్రావతి, రాములునాయక్, పాలేరు మాజీ ఎమ్మెల్యేకందాళ ఉపేందర్‌రెడ్డి, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల్లో ఇప్పటికే పెద్దఎత్తున నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించారు. ఈ నెల 18న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుండడంతో నామా నాగేశ్వరరావు బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఈ నెల 24న ఖమ్మంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ దాఖలు సందర్భంగా పెద్దఎత్తున ప్రదర్శన నిర్వహించాలని సంకల్పించారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నామా నాగేశ్వరరావు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా సుమారు 1.60 లక్షల ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థిని రేణుకాచౌదరిపై విజయం సాధించారు. శాసనసభ ఎన్నికలకు భిన్నంగా లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల తీర్పు గతంలోనూ ఉండడంతో ఈసారి అదే ఆనవాయితీ కొనసాగి నామా నాగేశ్వరరావు ఘన విజయం సాధిస్తారని బీఆర్ఎస్ పార్టీ వర్గాలు బలంగా నమ్ముతున్నాయి. మరోవైపు ఎన్నికల సమయం సమీపిస్తున్నా ప్రధాన రాజకీయ పార్టీ కాంగ్రెస్ ఇప్పటికీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిని ఖరారు చేయకపోవడం, ఆ పార్టీలో రోజురో అభ్యర్థి పేరు తెరపైకి రావడంతో పార్టీ శ్రేణుల్లో కొంత గందరగోళం నెలకొన్నది. ఖమ్మం లోక్‌సభ సభ్యుడిగా అన్నివర్గాలతో పరిచయం ఉన్న నామా నాగేశ్వరరావు తన విజయం కోసం పార్టీ నేతల తోడ్పాటుతో వివిధవర్గాల ప్రజలను కలిసి రాష్ట్రంలో పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, లోక్‌సభ సభ్యుడిగా రెండు దఫాలుగా ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధికి తాను చేసిన కృషిని వివరిస్తున్నారు. 2009లో తాను తొలిసారిగా లోక్‌సభ సభ్యునిగా ఎన్నికైన సమయంలో తెలంగాణ రాష్ట్రం సిద్ధించేందుకు చేసిన కృషి జాతీయస్థాయిలో నాయకులను సమన్వయం చేయడానికి తీసుకున్న క్రియాశీలక పాత్రను ఆయన వివిధవర్గాల ప్రజలకు, పార్టీ శ్రేణులకు వివరిస్తున్నారు. మళ్లీ భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, కార్యకర్తలు మనోధైర్యాన్ని కోల్పోవాల్సిన అవసరంలేదని, జిల్లా పార్టీ నేతలతోపాటు తాను ప్రజలకు అండగా ఉంటామని, ఏ కష్టమొచ్చినా ఎంత అర్ధరాత్రయినా తన ఇంటి తలుపు తట్టవచ్చని, తన ఇల్లు పార్టీ కార్యకర్తల ఇల్లేనని ఆయన పార్టీ కార్యకర్తల్లో భరోసా నింపుతున్నారు. ఇప్పటికే మధిర, పాలేరు, సత్తుపల్లి, వైరా, అశ్వారావుపేట, కొత్తగూడెం నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో నామా కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహించారు. శనివారం మధిర నియోజకవర్గ పరిధిలోని ముదిగొండ మండలంలో పర్యటించి కార్యకర్తల సమావేశంలో ప్రసంగించారు. తాను ప్రజాసేవ కోసం అంకితమయ్యాయని, ప్రజాసమస్యల పరిష్కారానికి దశాబ్దకాలంపాటు లోక్‌సభలో తెలంగాణ ప్రజల వాణిని, ఖమ్మం జిల్లా ప్రజల ఇబ్బందులను ఎలుగెత్తి చాటి అనేక సమస్యలు పరిష్కరించినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రం విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో అనేకం అమలుచేయాల్సిన పరిస్థితి ఉన్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వాటిని పట్టించుకోవడంలేదని, ఖాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారంలో ఉక్కు కర్మాగారం ఏర్పాటు వంటి ప్రధాన సమస్యల పరిష్కారంపై ఈసారి మరింత పోరాటం చేస్తామని నామా పలు సభల్లో నియోజకవర్గ ప్రజలకు భరోసా ఇస్తున్నారు. నామా నాగేశ్వరరావు హాజరైన ప్రతిసభలోనూ పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, ప్రజలు హాజరవుతుండడంతో బీఆర్ఎస్ పార్టీ విజయానికి ఈ హాజరుశాతం సంకేతాలుగా పార్టీ నేతలు భావిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ తదితరులు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయడం, మండలాలవారీగా సమావేశాలు నిర్వహించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను ఇప్పటికే పార్టీ మండల, నియోజకవర్గ నేతలతో చర్చించి సమావేశ తేదీలను ఖరారు చేశారు. నామినేషన్ వేసేనాటికి నియోజకవర్గ పరిధిలోని ప్రధాన ప్రాంతాలన్నింటిలో పర్యటన చేయాలని ప్రణాళిక రూపొందించుకున్న నామా నామినేషన్ అనంతరం ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేసేందుకు వ్యూహం రూపొందించారు. నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో బస్సు యాత్రల్లోనూ, బహిరంగ సభల్లోనూ పాల్గొనే అవకాశం ఉండటంతో ఆయా నియోజకవర్గాల పార్టీ నేతలు ఇందుకు సమాయత్తమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయకపోవడం, బీజేపీ పార్టీ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినా పార్టీ అభ్యర్థి జిల్లా నేతలకు రాజకీయంగా కొత్త కావడం వంటి అంశాలు ఈసారి బీఆర్ఎస్ అభ్యర్థి నామాకు కలిసి వస్తాయని బీఆర్ఎస్ శ్రేణులు భావిస్తున్నాయి.

ఖమ్మం నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు

చర్చిల్లో ఎంపీ నామా ప్రచారం

ఖమ్మం, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ఆదివారం ఖమ్మం నగరంలోని పలు చర్చిలను సందర్శించి, క్రైస్తవులతో మమేకమై ప్రార్థనల్లో పాల్గొన్నారు. చర్చి కాంపౌండ్, ఎన్ఎస్పీ, కరుణగిరి, బైపాస్ రోడ్డులోని చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో నామా పాల్గొని, క్రైస్తలను కలిసి ఎన్నికల్లో తనకు ఓటు వేసి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేసి, నామాని ఆశీర్వదించారు. అభివృద్ధికి, ప్రజాసేవ కోసం, సంక్షేమం కోసం నామాపై దైవ కృప ఉంటుందని దీవించారు. ఈ సందర్భంగా బిషప్ ప్రత్యేక ప్రార్థన చేసి, నామాను ఆశీర్వదించారు. కల్వరి టెంపుల్‌లో చర్చి ఇన్‌చార్జ్ శ్రీనివాస్ బైబిల్ అందజేసి, నామాను సత్కరించారు. కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్, తాళ్లూరి జీవన్, చిత్తారు సింహాద్రి యాదవ్, నామా సేవా సమితి నుంచి రాజేశ్, చీకటి రాంబాబు, కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఎంపీలు నామా, వద్దిరాజు

ప్రజల కోసమే అహర్నిశలు శ్రమిస్తా

ప్రతిఒక్కరికీ అండగా ఉంటా.. ఆశీర్వదించండి
బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు
అబద్ధపు హామీలతో ప్రజలను మోసగించారు : రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు
రాజకీయాల్లో గెలుపోటములు సహజం : ఎమ్మెల్సీ తాతా మధు

సమావేశంలో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పక్కన ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కొండబాల, మేయర్ నీరజ తదితరులు

మధిర, ఏప్రిల్ 14 : త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లేసి గెలిపిస్తే ప్రజలు, పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తానని, ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉండి అండగా ఉంటానని బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ పక్షనేత, ఖమ్మం అభ్యర్థి నామా నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మధిర కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో మధిర పట్టణ, రూరల్ బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ విస్తృతస్థాయి సమావేశం రావూరి శ్రీనివాసరావు, కనుమూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ గత పదేళ్లు ఈ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. రాష్ట్రంలో బడుగు, బలహీన, రైతాంగ అభివృద్ధి కోసం నాటి సీఎం కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. నిత్యం ప్రజా సంరక్షణ కోసం రాష్ట్రంలో కేసీఆర్ పాలన కొనసాగిందని, అది ఇప్పుడు ఆ పాలన కాస్తా అభివృద్ధికి విరుద్ధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రంలోని సమస్యల పరిష్కారం కోసం పార్లమెంట్‌లో నిత్యం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి నాడు ఎంతో కృషి చేశానన్నారు. మళ్లీ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించి మరోసారి పార్లమెంట్‌కు పంపించాలని కోరారు. మధిర నియోజకవర్గంలో తనకు గత పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సాధించామని, ఆ మెజార్టీని ఇప్పుడు రెట్టింపు చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి గెలిపించాలని, ఈ గెలుపు రాష్ట్రానికి ఒక మలుపులా తిప్పాలన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ అబద్ధపు హామీలను ప్రజలకు ఇచ్చి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రైతులను ఎవరు పట్టించుకోరో వారికి ఈ దేశంలో తగిన విధంగా రైతాంగం బుద్ధి చెబుతారన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌రావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలకు గెలుపు, ఓటములు సహజమని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు రాష్ట్ర ప్రజలు ఆకర్శితులై అధికారం ఇచ్చారన్నారు. ఎంపీ ఎన్నికల్లో ప్రజల ఓటును బీఆర్ఎస్ వైపు మళ్లించుకోవాలన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు మధిర నియోజకవర్గంలో నాడు నామాకు 82 వేల ఓట్లు వచ్చాయని, కాంగ్రెస్‌కు 62 వేలు మాత్రమే రావడం జరిగిందన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, నాయకులు రంగిశెట్టి కోటేశ్వరరావు, చిత్తారు నాగేశ్వరరావు, మొండితోక జయాకర్, బిక్కి కృష్ణప్రసాద్, చావా వేణు, తాళ్లూరి జీవన్‌కుమార్, శీలం వెంకటరెడ్డి, వాసిరెడ్డి నాగేశ్వరరావు, బొగ్గుల భాస్కర్‌రెడ్డి, అరిగె శ్రీనివాసరావు, కోన నరేందర్‌రెడ్డి, భోగ్యం ఇందిర, అబ్బూరి రామన్, చావా వేణు, కౌన్సిలర్లు ఇక్బాల్, మాధవి, అప్పారావు, వరలక్ష్మీ, రజిని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తాతా మధుసూదన్

మాట్లాడుతున్న లింగాల కమల్‌రాజు

సంప్రదాయబద్ధంగా గరుడ ధ్వజ పట లేఖనం

- నేడు గరుడ ధ్వజారోహణం
- సంతానం లేని వారికి గరుడ ముద్దలు పంపిణీ

భద్రాచలం, ఏప్రిల్14: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసంత పక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక జీయర్ మఠంలో గరుడ ధ్వజపట లేఖనం కార్యక్రమాన్ని అర్చకులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఉదయం ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపారు. అనంతరం భూతద్దంతో అగ్ని ప్రతిష్ఠను నిర్వహించారు. మధ్యాహ్నం జీయర్ మఠానికి వెళ్లి తెల్లని వస్త్రంపై గరుత్మంతుడి చిత్రపటాన్ని చిత్రీకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. సోమవారం గరుడ ధ్వజ పటాన్ని ధ్వజ స్థంభానికి ధ్వజారోహణం చేస్తారు. గరుడ ధ్వజ పటానికి హారతులు సమర్పించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి, దేవనాథ రామానుజ జీయర్ స్వామి, దేవస్థానం ఆస్థాన స్థానాచార్యులు కేశ స్థలశాయి, ఆలయ ప్రధానార్చకులు అమరవాది విజయరాఘవన్, పొడిచేటి సీతారామానుజాచార్యులు, ఉప ప్రధానార్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, అమరవాది మురళీ కృష్ణమాచార్యులు, వేద పండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూజలు చేస్తున్న అర్చకులు

నేడు గరుడ ధ్వజారోహణం

శ్రీరామ నవమి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, చతుః స్థానార్చన జరుపనున్నారు. గరుడ పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ధ్వజారోహణం చేయనున్నారు. అనంతరం సంతానం లేని మహిళలకు గరుడ ముద్దలను పంపిణీ చేస్తారు. సాయంత్రం భేరీ తాడనం, దేవతాహ్వానం, బలిహరణం, హనుమత్ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవను తాతగుడి సెంటర్ వరకు జరుపనున్నారు.

అంబేద్కర్ ఆశయాలను సాధించాలి

ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎంపీలు నామా, వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్

సత్తుపల్లి టౌన్ : అంబేద్కర్‌కు పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

- ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర
- ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి

ఖమ్మం, ఏప్రిల్ 14 : భారత రాజ్యాంగ నిర్మాత, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. అంబేద్కర్ స్ఫూర్తితో కేసీఆర్ పాలన కొనసాగించారని, దేశంలో ఎక్కడా లేనివిధంగా హైదరాబాద్‌లో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. తెలంగాణ సచివాలయానికి కూడా ఆయన పేరు పెట్టడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాములునాయక్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మేయర్ పునుకొల్లు నీరజ, భద్రాద్రి జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఖమ్మంరూరల్ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, పార్టీ నాయకులు తాళ్లూరి జీవన్, మైనార్టీ నాయకులు తాజుద్దీన్, సాజిద్, లింగాల రవికుమార్, కన్నం ప్రసన్నకృష్ణ, జోలే ప్రసన్నలక్ష్మిసాయి, ప్రసాద్, కార్పొరేటర్లు దాదే అమృతమ్మ సతీశ్, షకీనా, అబ్బాస్, బొమ్మెర రామ్మూర్తి, సుబ్బారావు, ఉప్పల వెంకటరమణ, చిత్తారు సింహాద్రియాదవ్, శీలంశెట్టి వీరభద్రం,ముస్లిం మైనార్టీ నాయకులు తాజుద్దీన్, పార్టీ నాయకులు చెరుకుమల్లి రవి, వాకదాని కోటేశ్వరరావు, బెల్లం వేణు, మేకల సుగుణారావు, పలువురు కార్పొరేటర్లు జ్యోతిరెడ్డి, నామా సేవా సమితి సభ్యులు రాజేశ్, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పాలన

-డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మామిళ్లగూడెం, ఏప్రిల్ 14 : అంబేద్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్నదని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనా మార్గంలో మనందరం నడవడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ప్రపంచ మేధావిగా అన్నిదేశాల చట్టాలను అధ్యయనం చేసి దేశానికి అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన సామాజికవేత్త అంబేద్కర్ అని కొనియాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో భట్టి మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడానికి ప్రభుత్వం నిధులను సమీకరించిందని తెలిపారు. అదేవిధంగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వీరితోపాటు కిరణ్ ముగభాత్సవ్, రాయల నాగేశ్వరరావు, మహ్మద్ జావేద్, నాగండ్ల దీపక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న కలెక్టర్ వీపీ గౌతమ్

అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

నివాళి అర్పిస్తున్న మంత్రి తుమ్మల

మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నివాళి అర్పిస్తున్న మంత్రి పొంగులేటి

భద్రగిరికి కల్యాణ శోభ

- సీతారాముల పరిణయానికి సిద్ధమైన సన్నిధానం
- కాంతులీనుతున్న భద్రాచలం పట్టణం, ఆలయం
- 17న జానకిరాముల కల్యాణం.. 18న పట్టాభిషేకం
- ప్రముఖులకు ఆహ్వానాలు.. ఏర్పాట్లలో అధికారులు..

భద్రాద్రి కొత్తగూడెం. ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ):భద్రగిరి కొండకు కల్యాణ శోభ సంతరించుకుంది. సీతారామచంద్రస్వామి కల్యాణానికి మిథిలా ప్రాంగణం ముస్తాబవుతోంది. పావన గౌతమీ తీరం రామయ్య కల్యాణానికి వచ్చే భక్తులను పునీతం చేయడానికి సిద్ధమైంది. భద్రాచలం కొండపై కొలువై ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణమహోత్సవానికి ముహూర్తపు ఘడియలు సమీపిస్తున్నాయి. ఈ నెల 17న జానకిరాముల పరిణయం, 18న రామయ్య పట్టాభిషేకం ఉత్సవాల క్రతువును వైభవంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ అన్ని ఏర్పాట్లూ చేసింది. ఎండోమెంట్ కమిషనర్ హనుమంతురావు, దేవస్థానం ఈవో రమాదేవి తదితరులు.. కల్యాణతంతు ఏర్పాట్లను సమీక్షిస్తున్నారు. పనులన్నీ చివరి దశకు చేరుకున్నాయి. శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు కలెక్టర్ ప్రియాంక కూడా ప్రత్యేక దృష్టిసారించి ఇప్పటికే రెండుసార్లు సమీక్షించారు. రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు దేశవ్యాప్తంగా అశేష సంఖ్యలో భక్తులు రానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లతోపాటు లడ్డూ ప్రసాదాలు, తలంబ్రాలను సిద్ధం చేస్తున్నారు. కాగా, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం దివ్యక్షేత్రంలో 1999, 2011, 2023లో పుష్కర పట్టాభిషేకం నిర్వహించగా.. ఈసారి సీతారామ పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

విద్యుత్‌కాంతులతో వెలుగులీనుతున్న భద్రగిరి కొండ

మిథిలా ప్రాంగణంలో 26 సెక్టార్లు..

జానకరాముల కల్యాణం జరిగే మిథిలా ప్రాంగణాన్ని అధికారులు 26 సెక్టార్లుగా విభజించారు. ఎన్నికల కోడ్ ఉండడంతో ఈసారి ప్రజాప్రతినిధులు తక్కువగా వచ్చే అవకాశం ఉంది. దీంతో భక్తుల సంఖ్య పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తం 26 సెక్టార్ల ద్వారా భక్తులు కల్యాణాన్ని తిలకించడానికి 15,860 టిక్కెట్లను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఉంచారు. మరో 15 వేలకు పైగా భక్తులు ఉచితంగా కల్యాణం తిలకించనున్నారు. మొత్తంగా 40 వేల మంది భక్తులు కల్యాణం తిలకించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు, ఆ తరువాత దేవతామూర్తులను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి సామాన్య భక్తులు కూడా వస్తుంటారు. కల్యాణానికి ముందు, ఆ తరువాత రెండు మూడు రోజులపాటు వీరు అక్కడే ఉండి సేదదీరేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు..ఆర్‌టీసీ, రైల్వే శాఖలు ప్రత్యేక రవాణా సౌకర్యాలను ఏర్పాటు చేశాయి.

200 క్వింటాళ్ల తలంబ్రాలు..

సీతారాముల కల్యాణ తలంబ్రాలు ఎంతో ప్రాముఖ్యత కలిగినవి. భద్రగిరికి వచ్చే భక్తులతోపాటు కల్యాణాన్ని వీక్షించేందుకు రాలేని భక్తులకు కూడా అధికారులు వీటిని అందించనున్నారు. ఇప్పటికే ఉమ్మడి రాష్ట్రానికి చెందిన పలువురు భక్తులు గోటి తలంబ్రాలను అందజేశారు. అంతా కలిపి దేవస్థానం అధికారులు 200 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేశారు. ప్రతి ఒక్కరికీ ఇవి అందించనున్నారు. అలాగే, 2 లక్షల లడ్డూలను అందుబాటులో ఉంచారు. నవమి రోజున తలంబ్రాలకు 60 కౌంటర్లు, లడ్డూలకు 19 కౌంటర్లు ఏర్పాటు చేశారు. అలాగే, స్వాగత తోరణాలు, విద్యుత్ కాంతులతో భద్రాచలం పట్టణాన్ని, దేవస్థానాన్ని అలంకరించారు. ఖమ్మం, కొత్తగూడెం పట్టణాల్లో కూడా స్వాగత శ్రీరామనవమి స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

జిల్లా వ్యాప్తంగా సమాచార కేంద్రాలు..

ముందస్తు సమాచారం కోసం పౌరసంబంధాల శాఖ జిల్లా వ్యాప్తంగా 25 చోట్ల సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసింది. కల్యాణం జరిగే మిథిలా స్టేడియం, పార్కింగ్, తలంబ్రాలు, లడ్డూ ప్రసాదాలు, టాయిలెట్లు, స్నానఘట్టాలు తదితర వివరాలు తెలిపేలా రూట్‌మ్యాప్‌ను కూడా సిద్ధం చేశారు. కొత్తగూడెం బస్టాండ్, రైల్వేస్టేషన్, కిన్నెరసాని, భద్రాచలం టోల్‌గేట్‌లతోపాటు భద్రాచలం పట్టణంలోని అన్ని పాంతాల్లోనూ సమాచార కేంద్రాలను ఏర్పాటు చేశారు.

అధికారులకు ప్రత్యేక విధులు..

సీతారాముల కల్యాణాన్ని తిలకించడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షించేందుకు కలెక్టర్ ప్రియాంక అధికారులకు ప్రత్యేక విధులకు కేటాయించారు. తాగునీటి సమస్యపై ఆ శాఖ ఏఈలను ఇన్‌చార్జులుగా నియమించారు. 200 కుళాయిలను అందుబాటులో ఉంచారు. అలాగే, కల్యాణ క్రతువును భక్తులు కనులారా తిలకించేందుకు 6 ఎల్ఈడీలను ఏర్పాటు చేశారు. గోదావరి వద్ద బారికేడ్లను ఏర్పాటుచేసి 200 మంది ఈతగాళ్లను, 135 కంట్రీ బోట్లను సిద్ధంగా ఉంచారు. అలాగే, 26 సెక్టార్లలో సెక్టారుకు ప్రత్యేక అధికారిని, 25 జోన్లలో పారిశుధ్య కార్మికులను నియమించారు. ప్రతీ జోన్‌కు ఎంపీవోతో పాటు నలుగురు కార్యదర్శులను ఉంచారు. 08743-232444 నంబరుతో భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమును అందుబాటులో ఉంచారు.

ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చాం..



భద్రాచలానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యమూ కలుగకుండా ఏర్పాట్లు చేశాం. కల్యాణం, పట్టాభిషేకం, సెక్టార్లు, వసతి సౌకర్యాల కోసం ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చాం. భక్తులు వాటి ద్వారా తమకు కావాల్సిన సర్వీసులను ముందస్తుగానే బుక్ చేసుకోవచ్చు. నదీ తీరంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాం. వంతెనపై వాహనాలు నిలిచిపోతే క్లియర్ చేసేందుకు క్రేన్‌లు సిద్ధం చేశాం. అత్యవసర వైద్యం కోసం ఏరియా ఆసుపత్రిలో 20 బెడ్లను అందుబాటులో ఉంచాం. భక్తులందరూ విచ్చేసి రామయ్య కల్యాణాన్ని కనులారా వీక్షించి వెళ్లొచ్చు.

-డాక్టర్ ప్రియాంక, భద్రాద్రి కలెక్టర్